# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 335
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
అక్టోబర్ 23, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net






## విలేఖరులకు ఆహ్వానం

వరంగల్ వాయిస్ సాయంకాలం దినపత్రిలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన విలేఖరులు, అడ్వటైజ్ మెంట్ ఏజెంట్లకు యాజమాన్యం స్వాగతం పలుకుతోంది. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల స్టాఫ్ రిపోర్టర్లతోపాటు నర్సంపేట, కాటారం, మరిపెడ, క్రైం, ఎంజీఎం, గ్రేన్ మార్కెట్, వరంగల్ కలెక్టరేట్, హనుమకొండ కలెక్టరేట్, స్టేషన్ ఘనపూర్ పరిధిలో పనిచేయుటకు ఆసక్తి కలిగిన వారు సెల్ నెంబర్ 99891 24061, 98499 43339 లలో సంప్రదించగలరు. - వరంగల్ వాయిస్ యాజమాన్యం


2లో..



## కేటీఆర్‌కు వార్నింగ్

- ఊకదంపుడు ప్రసంగాలు మానుకో..
- తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



8లో..

## కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన

- మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అమ్ముకాలు
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

- ఏసీబీ కొరడా ఝులిపించేనా..
- అక్రమార్కుల భరతం పట్టేనా..
- ఫోన్ కాల్ తో రూ.10.20 లక్షలు సమర్పయామి
- ఈ లెక్కన వారు కూడబెడుతున్నదెంత..
- నిఘా అధికారులు దృష్టి సారించాలంటున్న జనం




# నెక్ట్స్ ఏంటీ..?

వివరాలు2లో..

ఎన్నెన్నో అనుమానాలు.. అంతుచిక్కని ట్విస్ట్ లు.. ఒక్క ఫోన్ కాల్ తో రూ.10.20 లక్షలు సమర్పయామి చేసుకోవడం వెనుక ఉన్న నిజాలేంటి.. ఈ లెక్కన వారు కూడబెడుతున్నదెంత అన్న అనుమనాలు సర్వత్రా వ్యక్తమవుతోంది. అక్రమార్కులకు నిలయంగా మారిన ఆర్టీఏలో విధులు నిర్వహిస్తున్న వారిపై ఇప్పటికైనా ఏసీబీ అధికారులు కొరడా ఝులిపించేనా.. అక్రమార్కుల భరతం పట్టేనా అన్న ప్రచారం సాగుతోంది. సంపాదనకు మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ ఫోన్ ద్వారా బెదిరింపులకు పాల్పడితేనే ముందూ వెనుక ఆలోచించకుండా మూడు విడతల్లో ఆన్ లైన్ ద్వారా పెద్ద మొత్తంలో ట్రాన్స్ ఫర్ చేశారంటే ఈ లెక్కన నిజమైన ఏసీబీ అధికారులు రంగంలోకి దిగితే వారి నుంచి ఏ మేరకు అక్రమాస్తులు స్వాధీనం చేసుకోవచ్చన్న చర్చ సాగుతోంది. చేస్తున్న ఉద్యోగానికి.. దినదినాభివృద్ధి చెందుతున్న ఆస్తులకు మధ్య వ్యత్యాసం భారీగానే ఉంటోందంటున్నారు. దీనిని ఒక ఉద్యోగి మోసపోవడంగా కాకుండా ఎంతమంది అమాయకులను సదరు అధికారి మోసం చేశాడన్న కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అప్పుడే అక్రమార్కులకు వణుకు పుడుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అయితే ఈ ఎపిసోడ్ లో నెక్ట్స్ ఏంటీ అన్న ట్విస్ట్ కొనసాగుతోంది. - వరంగల్ వాయిస్ ప్రతినిధి




# నెక్ట్స్ ఏంటీ..?

- ఏసీబీ కొరడా ఝులిపించేనా..
- అక్రమార్కుల భరతం పట్టేనా..
- ఫోన్ కాల్ తో రూ.10.20 లక్షలు సమర్పయామి
- ఈ లెక్కన వారు కూడబెడుతున్నదెంత..
- నిఘా అధికారులు దృష్టి సారించాలంటున్న జనం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** ఆర్టీఏ అంటేనే అక్రమాల పుట్ట. అక్కడ జరుగుతున్న దందా అంతా ఇంతా కాదు. ప్రతి పనికి ఒక రేట్ ఫిక్స్ అయి ఉంటుంది. ఇదంతా కార్యాలయం బయట ఉండే బ్రోకర్ల ద్వారానే సాగుతోంది. ప్రతి ఫైల్ పైన వారు కోడ్ వేస్తేనే ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ముందుకు సాగుతుంది. లేదంటే చెప్పులు అరిగేలా ఆర్టీఏ కార్యాలయం చుట్టూ తిరగడం ఖాయం. ఆర్టీఏ కార్యాలయంలో పనిచేసేవాళ్లే మాయగాళ్లు అంటే వారికే టోకరా వేశారు మహా మాయగాళ్లు. ఏసీబీ అధికారినంటూ ఫోన్ చేయగానే గజగజా వణికిపోయి ముందూ వెనుక ఆలోచించకుండా రూ.10.20 లక్షలు సమర్పించుకోవడం చర్చనీయాంశంగా మారింది.




### వారం రోజులుగా..

వారం రోజుల క్రితం వరంగల్ ఆర్టీఏ కార్యాలయంలో ఇంచార్జి మోటార్ వెహికల్ ఇన్ స్పెక్టర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న జైపాల్ రెడ్డికి ఏసీబీ అధికారులమంటూ ఫోన్ వచ్చింది. మీపై ఏసీబీకి ఫిర్యాదు వచ్చింది.. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. సెటిల్ చేసుకుంటే డీఎస్పీ వదిలేస్తాడు.. లేకుంటే తెల్లవారేలోపు నీపై దాడులు జరుగుతాయంటూ హెచ్చరించారు. మచ్చుకు కొన్ని విషయాలు చెప్పి సదరు అధికారి బెదిరిపోయేలా చేశాడు. దీంతో హడలెత్తిపోయిన అధికారి హుటాహుటిన ఆన్ లైన్ ద్వారా రూ.2 లక్షలను ముట్టజెప్పారు. మరుసటి రోజు మరో రూ.8.20 లక్షలను సమర్పించుకున్నారు.

### కేసు నమోదు..

ఏసీబీ అధికారులమంటూ తనను మోసం చేసిన విషయాన్ని గుర్తించిన సదరు ఎంవీఐ మిల్స్ కాలనీ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మిల్స్ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతోనే అసలు కథ బయటపడింది. అయితే సదరు అధికారి మోసపోయినట్లుగా కాకుండా ఎంతమంది అమాయక ప్రజలను మోసం చేసి అక్రమాస్తులు ఎన్ని కూడబెట్టారన్న కోనంలో దర్యాప్తు సాగించాలన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఒక్క ఫోన్ కాల్ తోనే బెంబేలెత్తిపోయి రూ.10.20 సమర్పించుకున్న సాదరు ఉద్యోగి ఇంకా ఎన్ని లక్షల అక్రమాస్తులు కూడబెట్టాడో వెలికి తీయాల్సిన అవసరం ఉంది. ఒక్క ఆర్టీయే అధికారులనే కాకుండా బల్దియా, రెవెన్యూ కార్యాలయాలపై కూడా ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి లెక్కకు మించి ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఉందంటున్నారు. ఎంవీఐ ఫిర్యాదునే సుమోటోగా స్వీకరించి ధర్యాప్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు. అయితే అక్రమాస్తులు కలిగిన అధికారులపై ఏసీబీ కొరడా ఝులిపిస్తుందా లేక ఎప్పటిలాగే ఫైల్ క్లోజ్ చేస్తారా అన్న చర్చ సాగుతోంది.

# కేటీఆర్ కు వార్నింగ్

- ఊకదంపుడు ప్రసంగాలు మానుకో..
- తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చిన ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అర్థరహిత విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. ఉప ఎన్నికల నేపథ్యంలో ఊకదంపుడు ప్రసంగాలు మానుకోవాలంటూ హితవు పలికారు. ఒక్కసారి మీ పదేళ్ల పాలన గురించి ఆలోచించాలంటూ సూచించారు. మా ముఖ్యమంత్రి సమర్థత ఏంటో మీ కుటుంబం మొత్తం చూసిందని ఎద్దేవా చేశారు. మీ పాలనలో ఎమ్మెల్యేలు, మంత్రులను ఏ మేరకు గౌరవించారో ప్రజలు గమనించారన్నారు. దళిత నాయకుడు అని చూడకుండా ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి తొలిగిస్తే సొంత పార్టీలో ఉన్న దళిత నేతలు మాట్లాడిన దాఖలాలు లేని విషయాన్ని మరువరాదన్నారు. దోచుకునేందుకు సమర్థులైన అధికారులను పక్కనపెట్టి రిటైర్డ్ అధికారులతో పాలన చేసిన విషయాన్ని మరిచారా అన్నారు. నీ సొంత చెల్లె మీ అవినీతి బాగోతలను బయటడితే స్పందించడం చేతకాని మీరు రేవంత్ రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. మీ మాటలను తెలంగాణ సమాజం అసహ్యంచుకుంటుందన్నారు. మా ముఖ్యమంత్రిని విమర్శిస్తే గొప్పోడివి అయితాననుకోవడం నీ అవివేకం అన్నారు. పోలీసులు అసమర్థులంటూ మాట్లాడడం తన వివేకానికే వదిలేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ పోలీసులు సమర్థులా, అసమార్థులా చూపిస్తారన్నారు.



# ఘనంగా కొండా మురళి జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని పోచమ్మ మైదాన్ జంక్షన్ లో గురువారం మాజీ ఎమ్మెల్సీ, బడుగు, బలహీన వర్గాల నాయకులు కొండా మురళీధర్ రావు జన్మదిన సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు పసునూరి దయాకర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో భారీ కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వెయ్యి మంది పారిశుద్ధ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పసునూరి దయాకర్, గోపాల నవీన్ రాజు మాట్లాడుతూ కొండా మురళీధర్ రావు జన్మదిన వేడుకలు వరంగల్ తూర్పు నియోజకవర్గంతోపాటు పరకాల నియోజకవర్గం, వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించినట్లు వెల్లడించారు. పోచమ్మ మైదానంలో 1000 మంది పారిశుద్ధ కార్మికులకు దుప్పట్ల పంపిణీ, 3000 మందికి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కొండా దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్తపెల్లి శ్రీను, భాషాపాక సదానందం, జారతి రమేష్, మబ్బు ప్రవీణ్, కత్తెరసాల వేణుగోపాల్, మహమ్మద్ వసీం, కురిమిళ్ళ సంపత్, మహమ్మద్ మోసిన్, కార్పొరేటర్లు బసవరాజు కుమార్, ఎండి పురుకాన్, వసుకుల బాబు, ఓనీ స్వర్ణలత భాస్కర్, బాల్నే సురేష్, ముష్కమల్ల అరుణ సుధాకర్, గుండు చందన పూర్ణచందర్, చింతాకుల అనిల్, మాజీ కార్పొరేటర్లు ఎండి యాకూబ్ పాషా, బాసాని శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కొండా దంపతులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రక్తదానంతో ముగ్గురి ప్రాణాలు కాపాడొచ్చు

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్
- ఘన్పూర్ పోలీస్ స్టేషన్, ఏసీపీ కార్యాలయం సందర్శన

**వరంగల్ వాయిస్, క్రైం :** రక్త దానం చేయడం ద్వారా ముగ్గురి ప్రాణాలను కాపాడగలమని వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీపేట డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మడికొండలోని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. వీరికి సీపీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, పండ్లను అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులను స్మరిస్తూ రక్త దానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారికి అభినందనలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను స్మరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీపీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ అంకిత్ కుమార్, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, మడికొండ ఇన్ స్పెక్టర్ పుల్యాల కిషన్, హసన్ పర్తి ఇన్ స్పెక్టర్ చేరాలు, ఎస్సై లు, రాష్ట్ర రెడ్ క్రాస్ పాలక సభ్యుడు ఇవి శ్రీనివాస్ తో పాటు డాక్టర్లు ఇతర పోలీస్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

### ఏసీపీ కార్యాలయం సందర్శన..

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ గురువారం వెస్ట్‌జోన్ పరిధిలోని ఘనపూర్ పోలీస్ స్టేషన్ తో పాటు ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన సీపీ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలు, అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి తదితర సమాచారాన్ని సంబంధిత స్టేషన్ ఇన్ స్పెక్టర్‌ను



అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు ఉన్నాయి.. సెక్టార్‌వారిగా ఎస్సైలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్సైని అడిగి తెలిసుకున్నారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట వెస్ట్ జోన్ డీసీపీ రాజ మహేంద్ర నాయక్, ఏసీపీ భీం శర్మ, ఘన్పూర్ ఇన్స్ స్పెక్టర్ వేణుతోపాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

గురువారం, అక్టోబర్ 23, 2025

# డర్టీ ఏటీయం

## పర్యవేక్షణ కరవు... ఖాతాదారుల ఆగ్రహం..



- డోర్నకల్ ఎస్‌బీఐ ఏటీఎంలో అపరిశుభ్రత
- కార్నర్లో కావాల్సినంత కాగితాలు
- లక్ష్మిని పలకరించబోతే దుర్గంధం

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** డబ్బు తీయడానికి వస్తే దరిద్రం పలకరిస్తోంది! మనిషి మనుగడలో కీలకంగా మారిన డబ్బే... ఇక్కడ అపరిశుభ్రత, దుర్గంధంతో స్వాగతం పలుకుతోంది. డోర్నకల్ పట్టణంలోని రెండవ మెయిన్ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం గది పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. దాదాపు పది వేల మంది ఖాతాదారులకు డబ్బును అందించే ఈ ఏటీఎం, ఇప్పుడు సాలీడు గూళ్లు, చెత్తాచెదారంతో 'డంపింగ్ రూమ్'లా తయారైంది. డబ్బును లక్ష్మి స్వరూపంగా భావించి, కష్టార్జితాన్ని కార్డు ద్వారా కరెన్సీ రూపంలో తీసుకోవాలని వచ్చే ఖాతాదారులకు ఈ ఏటీఎం గదిలో పేరుకుపోయిన దుమ్ము, ధూళి, మురికి, సూక్ష్మజీవుల కాలుష్యం వెక్కిరిస్తున్నాయి. 'ఇది అసలు ఏటీఎమ్ గదేనా?' అనే సందేహం కలుగుతోంది. ఏటీఎమ్ మెషీన్‌తో పాటు ఉన్న రెండు ఏసీలు ఉన్నప్పటికీ, గది అంతటా అలుముకున్న సాలీళ్ల వలలు, మూలల్లో పేరుకుపోయిన వాడేసిన కాగితాలు, చెత్త... పరిశుభ్రతకు ఎంతమాత్రం తావు లేకుండా చేస్తున్నాయి.



నిత్యం రద్దీగా ఉండే ఈ ఏటీఎం నిర్వహణను బ్యాంకు అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని స్థానిక ఖాతాదారులు మండిపడుతున్నారు. "ఎన్నో ఏటీఎంలు చూశాం... కానీ ఇలాంటి దుర్గంధం, అపరిశుభ్రత ఉన్న ఏటీఎం ఎక్కడా చూడలేదు," అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందించి, ఈ ఏటీఎం గదిని శుభ్రం చేయించి , సరైన నిర్వహణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తమ ఆరోగ్యంపై ఈ కలుషిత వాతావరణం ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# నూతన గ్రామ కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** మండలంలోని పల్గుల గ్రామంలో యూత్ కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఐటీ, వాణిజ్యం, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కమిటీ ఎన్నిక జరిగింది. మహాదేవపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పర్షవేణి నగేష్ యాదవ్ పల్గుల నూతన గ్రామ కమిటీని ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మంద వినోద్, ఉపాధ్యక్షులు నిట్టూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి మానేం చిన్న సాగర్, కార్యదర్శి పూతల చంద్ర శేఖర్, కోశాధికారి పానేం రాజ్ కుమార్, అధికార ప్రతినిధి లేతకారి శంకర్, ప్రచార కమిటీ కన్వినర్ గా నిట్టూరి సంతోష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లాడుతూ, నూతన కమిటీ సభ్యులు పార్టీని బలోపేతం చేయడానికి ఉత్సాహంగా పని చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సైనికుడిలా పనిచేసి, పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ వడ్లకొండ సమ్మయ్య, గ్రామశాఖ అధ్యక్షులు మానేం మహేష్, మాజీ సర్పంచులు ఒడ్డె చంద్రయ్య, మచ్చ రాజయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు కొండగొర్ల సంతోష్, శంకర్, మంచినీళ్ల రాకేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్తీక మాస ఉత్సవాలు ప్రారంభం

**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం కార్తీక మాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్తీక మాసంలో భాగంగా మొదటి రోజు ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా, గణపురం మండల కేంద్రానికి చెందిన మచ్చక కోమల శంకర్ గౌడ్ కుమారులు, ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ. 10,016/- (పది వేల పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్‌కు అందజేశారు. అదేవిధంగా, కార్తీక మాస ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆకాశదీపోత్సవాన్ని ప్రారంభించారు. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో కట్కూరి సరోజన, రాజయ్య దంపతులు మరియు వారి కుమారులు కట్కూరి దీప్తి, అన్వేష్ దంపతులు పాల్గొన్నారు. పూజానంతరం, కార్తీక మాస నెల రోజులు పాటు ఆలయంలో ఆకాశ దీపం కోసం అవసరమైన నూనెను కూడా వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, గోరంట్ల రాజయ్య, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి, బూర రాజగోపాల్, మోటపోతుల రాజన్న గౌడ్, పాండవుల భద్రయ్య, దయ్యాల భద్రయ్య, ఉయ్యాల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# చెత్తలో కూరుకుపోయిన రామప్ప కాలనీ

## పండుగ వేళ సింగరేణి కార్మికులకు నరకం



**వరంగల్ వాయిస్, గణపురం :** దేశం మొత్తం దీపావళి దీపాలతో వెలుగులు నింపుకుంటున్న శుభసమయంలో... గణపురం మండల పరిధిలోని రామప్ప కాలనీలో నివసించే సింగరేణి కార్మికుల కుటుంబాలు మాత్రం దారుణమైన పరిస్థితుల్లో జీవిస్తున్నాయి. కాలనీ లోపల పేరుకుపోయిన చెత్త గుట్టలు, దుర్వాసనతో వాతావరణం పూర్తిగా అసహనంగా మారింది. కాలనీలో ఎటు చూసినా చెత్తే దర్శనమిస్తుండటంతో, స్థానికులు ముక్కులు మూసుకుని బయటకు రావాల్సిన దుస్థితి నెలకొంది. ఈ దుర్వాసన కారణంగా పిల్లల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వారు వాపోతున్నారు.

### సింగరేణి అధికారుల నిర్లక్ష్యం:

కాలనీ శుభ్రత పనుల పట్ల సింగరేణి అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీ వాసులు మండిపడుతున్నారు. పండుగ రోజుల్లో కూడా చెత్తకుప్పలు తొలగించకపోవడం వారిని తీవ్రంగా కలచివేసింది. "ఇది అధికారుల నిర్లక్ష్యమా...? లేక రాజకీయ దురుద్దేశమా...?" అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సింగరేణి అధికారులు స్పందించి, కాలనీని శుభ్రం చేయించి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని స్థానిక బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

# 'కపాస్ కిసాన్' యాప్ పై రైతులకు అవగాహన




**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పులుకుర్తి, వెంకటాపూర్, సింగరాజుపల్లి గ్రామాలలో గురువారం రైతులకు 'కపాస్ కిసాన్' యాప్ ద్వారా పత్తిని విక్రయించే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యాప్ ద్వారా పత్తి అమ్ముకోవాలంటే, రైతుల మొబైల్ నంబరు కచ్చితంగా రిజిస్టర్ అయి ఉండాలి. మొబైల్ నంబరు తప్పుగా నమోదై ఉంటే, దానిని సరిచేసుకునే అవకాశం కూడా కల్పించబడింది. రైతుల సౌకర్యార్థం, మొబైల్ నంబర్ల జాబితాను రైతు వేదికలలో మరియు గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించడం జరిగింది. రైతులు ఈ లిస్టులను పరిశీలించి, తమ నంబర్లు తప్పుగా ఉన్నట్లయితే వెంటనే సరిచేసుకోవాలని కోరడమైనది. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి విజ్ఞప్తి చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో గోపు సతీష్, అంకెశ్వరపు రాంబాబు, సూర కుమారస్వామి, గోవింద ప్రభాకర్, పెంచాల సరిత, పెంచాలా అఖిల్, సూర లక్ష్మణ్, ఏఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

# 'నమస్తే తెలంగాణ' ఆఫీస్‌పై దాడి సిగ్గుచేటు

## ◆ రాక్షస పాలనపై బీఆర్‌ఎస్‌వీ ఆగ్రహం

**వరంగల్ వాయిస్, శాయంపేట :** 'నమస్తే తెలంగాణ' పత్రిక కార్యాలయంపై దాడి చేయడం సిగ్గుచేటు అని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కొమ్మల శివ తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులపై, ముఖ్యంగా మహిళా జర్నలిస్టులపై దుర్భాషలాడుతూ దాడులకు పాల్పడడం హేయమైన, సిగ్గుమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కొమ్మల శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 'రాక్షస పాలన' నడుస్తోందని ఆయన ఆరోపించారు. "కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగించాలి" అని కొమ్మల శివ డిమాండ్ చేశారు. ఈ దాడులు ఇలాగే కొనసాగితే, రాబోయే కాలంలో విద్యార్థులు, యువకులు, ప్రజల చేతుల్లో తగిన గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇటువంటి చర్యలు



మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ సీనియర్ జిల్లా నాయకులు బెరుగు తరుణ్ గోపి, కళాశాల అధ్యక్ష కార్యదర్శులు అభిలాష్, సిద్దు, శివకుమార్, ప్రశాంత్, వినయ్, వంశీ, సాయి కృష్ణ, తేజ, గణేష్, మున్ని, నాని, మేఘనాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బిట్స్ స్కూల్‌లో దారుణం

## విద్యార్థినులపై లైంగిక వేధింపులు

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిట్స్ ప్రైవేట్ స్కూల్‌లో ఓ దారుణం చోటుచేసుకుంది. 10వ తరగతి చదువుతున్న బాలికలను లైంగికంగా వేధిస్తున్న ఆరోపణలపై స్కూల్‌లో పీఈటీ మాస్టర్‌గా పనిచేస్తున్న మోహన్ అనే వ్యక్తికి తీవ్ర దేహశుద్ధి జరిగింది. తమ పిల్లలను లైంగికంగా వేధిస్తున్న విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక భజరంగ్ దళ్ కార్యకర్తలతో కలిసి పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఆగ్రహంతో ఊగిపోయిన వారు, నిందితుడైన పీఈటీ మాస్టర్ మోహన్‌కు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన నేపథ్యంలో, వేధింపులకు గురైన విద్యార్థినులు తమను రక్షించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ లేఖలు రాయడం స్థానికంగా కలకలం సృష్టించింది. ఈ దారుణంపై పాఠశాల యాజమాన్యం, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు 'టైగర్' కొండా మురళీధర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని, వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ ఛైర్మన్ శామంతుల శ్రీనివాస్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాణికంఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు, వీధి భిక్షుకులు, అనాథలు, వృద్ధులకు భోజనం అందించారు. సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్న మణికంఠ ఫౌండేషన్‌కు తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని శ్రీనివాస్ఈ సందర్భంగా తెలిపారు.

## లీగల్ సెల్ ఆధ్వర్యంలో..



మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండా మురళీధర్ రావు పుట్టినరోజు వేడుకలను వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా లీగల్ సెల్ ఛైర్మన్ శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ కొండా అభిమానులు నిత్యం సమాజ సేవలో ముందుంటారని అన్నారు. జన్మదిన వేడుకల్లో భాగంగా అదాలత్‌లోని క్యాంటీన్‌లో వారు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్ కునూర్ రంజిత్ గౌడ్, అనుమాండ్ల రాజ్ కుమార్, రోడ్ల అమృత రావు, సుభాష్, చెన్నూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్–1 డీఎస్పీ ప్రవీణ్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, దామెర :** గ్రూప్–1 పరీక్షల్లో డీఎస్పీగా ఎంపికైన ఏటూరునాగారం వాసి దైనంపెల్లి ప్రవీణ్ కి దామెర మండలంలోని ఉరుగొండ గ్రామానికి విచ్చేసిన సందర్భంగా ఘన సన్మానం జరిగింది. స్థానిక యువజన నాయకులు ప్రవీణ్ కి శాలువాతో సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జన్ను విద్యా సాగర్, జన్ను సాంబయ్య, పొలెపాక రాజు, జన్ను మధు, జన్ను రమేశ్, జన్ను విజయ్, నల్ల మహేశ్, జన్ను శ్రీకాంత్, జన్ను దినేశ్ పాల్గొన్నారు.

# గో రక్షకుడిపై కాల్పులు దారుణం

## నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** హైదరాబాద్ లోని పోచారం ప్రాంతంలో గో రక్షకుడు అయిన ప్రశాంత్ కుమార్ పై ఇబ్రహీం అనే వ్యక్తి కాల్పులు జరిపిన ఘటనపై 19వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు, కట్టర్ హిందూ నాయకుడు మామిడాల సతీష్ తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన డిమాండ్ చేస్తూ, ఈ కాల్పుల ఘటనపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపాలని కోరారు. "ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే, నిందితుడైన ఇబ్రహీంను వెంటనే కఠినంగా శిక్షించాలి," అని మామిడాల సతీష్ డిమాండ్ చేశారు

# ఘనంగా కొండా మురళి జన్మదిన వేడుకలు

## ■ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రియతమ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గం 20వ డివిజన్ పరిధిలోని నరేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ నాయకులు బత్తుల వినోద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పీసీసీ డెలిగేట్ మెంబర్ నల్గొండ రమేష్, సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగోని స్వప్న మురళి గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తోట హరీష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి గిరి పుష్ప, వరంగల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 21, 19, 41 డివిజన్ అధ్యక్షులు కొమ్ముల సందీప్, దాసరి రాజేష్, మంద సన్నీ, కొండ వీరాభిమాని పోలేపాక యేసు, 19వ డివిజన్ అధ్యక్షురాలు రాజమణి తదితరులు కలిసి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, కంపాస్ బాక్స్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం నల్గొండ రమేష్ మాట్లాడుతూ తమ అభిమాన నాయకుడు కొండా మురళీధర్ రావు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పేదలకు సేవ చేసేలా భగవంతుడు ఆయనకు శక్తిని ఇవ్వాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగోతు మురళి, సిరిమల చెన్నమలు, కూచన రవి, ఇనుగాల బాబు, కటుకూరి అన్వేష్, ఎండీ అఫ్జల్, కొమ్ముల ప్రదీప్, వెంకన్నతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కొండా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్తీక మాస పూజల పోస్టర్ విడుదల



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని శ్రీ సాయిబాబా మందిరంలో కార్తీక మాస ప్రత్యేక పూజా విశేషాలతో కూడిన కరపత్రాన్ని గురువారం మందిర ఛైర్మన్ మతుకుమల్లి హరగోపాల్, ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, రాకం సదానందంలతో కలిసి విడుదల చేశారు. ఈ కరపత్రాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ హరగోపాల్ మాట్లాడుతూ కార్తీక మాసం అంతా ప్రతిరోజు ఉదయం 7 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా, నవంబర్ 5 బుధవారం కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మందిరంలో 216 మంది దంపతులచే సామూహిక సాయి సత్య వ్రతం, సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వ్రతాలలో పాల్గొనగోరు భక్తులు తమ గోత్ర నామాలను మందిర కౌంటర్‌లో నమోదు చేసుకోవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సాయి సేవకులు మధుసూదన్, పూజారి చందు తదితరులు పాల్గొన్నారు.

# శానిటేషన్ కార్మికులు దుప్పట్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, పోచమ్మ మైదాన్:** మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండా మురళీధర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని, పోచమ్మ మైదాన్ జంక్షన్ వద్ద ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోని మున్సిపల్ శానిటేషన్ కార్మికులు 1000 మందికి దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అలాగే, 2000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 23వ డివిజన్‌కు చెందిన 33 మంది కార్మికులకు దుప్పట్లను చిప్ప వెంకటేశ్వర్లు నేత, డివిజన్ అధ్యక్షులు దామెర రాజ్ కమల్, సీనియర్ నాయకులు గొండా శ్రీనివాస్, జవాన్ సాంబయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లు సతీష్, నంబి మురళి, దేవర రాము, మండల కిషన్, ఈగ శ్రీధర్, ఎస్ కే హైదర్, మామిడాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# బైరి సాంబయ్య దశదిన కర్మకు హాజరైన అరూరి రమేష్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం, గ్రేటర్ వరంగల్ 8వ డివిజన్ కార్పొరేటర్ బైరి లక్ష్మి కుమారి భర్త, మాజీ కౌన్సిలర్ బైరి సాంబయ్య దశదిన కర్మ కార్యక్రమానికి వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ బైరి సాంబయ్య చిత్రపటానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# మహా రుద్రయాగ శాల పనుల పరిశీలన



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలో నవంబర్ 3, సోమవారం రోజున జరగనున్న మహా రుద్రయాగం ఏర్పాట్లలో భాగంగా గురువారం యాగశాల పనులను పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సోదా రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏర్పాట్ల పురోగతిని తెలుసుకుని, కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మహారుద్ర యాగం కమిటీ సభ్యులు, శ్రీ కుంకుమేశ్వర ఆలయ ఛైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, మహా రుద్ర యాగం అధ్యక్షులు ఎర్రం లక్ష్మణ్, యాగం కో కన్వీనర్ గందె రవి, ఆముదాలపల్లి అశోక్ గౌడ్, శ్రీ కుంకుమేశ్వర ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు సంధ్య సత్యనారాయణ, తోట రవి పాల్గొన్నారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు ఎర్రబెల్లి భాస్కర్ రెడ్డి, నల్లెల్ల అనిల్ కుమార్, ఏకు రాజు, డీలర్ రాజేందర్ రెడ్డి, పావుశెట్టి అనిల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు

# ఆలయానికి నగదు అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం :** ప్రఖ్యాతిగాంచిన కాకతీయుల కాలం నాటి శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో వచ్చే నెల నవంబర్ 14, 15, 16 తేదీల్లో ప్రతిష్టాపన మహోత్సవం జరగనుంది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా జరగనున్న గణపతి, శివలింగ, నవగ్రహ, అష్ట బలిపీఠ ప్రతిష్టాపన కార్యక్రమం కోసం భక్తులు తమ వంతుగా విరాళాలు అందిస్తున్నారు. స్థానిక గణపురం మండల కేంద్రానికి చెందిన మార్క స్వరూపారాణి, అర్జున్ గౌడ్ దంపతులు, నేతల అనిత, వెంకటేశ్వర్ గౌడ్ దంపతులు తమ వంతుగా రూ. 10,116/– నగదును ఆలయ కమిటీ ఛైర్మన్ తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి, విరాళం అందజేసిన దాతలకు ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, భటిక స్వామి, బూర రాజగోపాల్ గౌడ్, మాదాసు మొగిలి గౌడ్, మాదాసు అర్జున గౌడు, ఉయ్యాల భిక్షపతి గౌడ్, దయ్యాలభద్రయ్య, పాండవుల భద్రయ్య, మోటపోతుల రాజన్న గౌడ్, గోరంటల రాజన్న గుప్త తదితరులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ పేరుతో ఘరానా మోసం

■ నిందితుడి అరెస్ట్, రిమాండ్ కు తరలింపు




**వరంగల్ వాయిస్, హనుమకొండ క్రైం :** రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో ఘరానా మోసానికి పాల్పడిన వ్యక్తిని హనుమకొండ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ వివరాలను వెల్లడించారు. నిందితుడిని మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన రామిడి సంపత్ రెడ్డి (36)గా గుర్తించారు. నిందితుడు సంపత్ రెడ్డి 2021 సంవత్సరంలో తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని, తక్కువ ధరకు భూములు ఇప్పిస్తానని బాధితులను నమ్మించాడు. వారి వద్ద నుండి సుమారు కోటి రూపాయలు వసూలు చేశాడు. అయితే, నిందితుడు ఎటువంటి భూములు చూపించకుండా, డబ్బు తిరిగి ఇవ్వకుండా వాయిదాలు వేస్తూ మోసం చేయడంతో బాధితులు ఈ సంవత్సరం జనవరి నెలలో హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గత సంవత్సరం నుంచి పరారీలో ఉన్న నిందితుడిని గురువారం హనుమకొండ బస్టాండ్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని విచారించగా బాధితుల నుంచి తీసుకున్న కోటి రూపాయలను ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి వాటిలో పెట్టి పోగొట్టుకున్నట్లు అంగీకరించాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ అరెస్టులో ఎస్సై కిషోర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పత్రికా కార్యాలయాలపై దాడులు సరికాదు

## తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పత్రికా, మీడియా కార్యాలయాలపై జరుగుతున్న దాడులను ప్రజలు, ప్రజాస్వామ్య వాదులంతా తీవ్రంగా ఖండించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలు నాలుగో స్తంభమన్న విషయాన్ని మర్చిపోయి, పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ, భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా మడికొండలోని నమస్తే తెలంగాణ పత్రిక యూనిట్ కార్యాలయంపై కొందరు దుండగులు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. పత్రికలు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉన్న విషయాన్ని ఎవరూ మర్చిపోరాదన్నారు. ప్రజల సమస్యలను, మనోభావాలను, ఆకాంక్షలను, అవినీతి అక్రమాలను పత్రికలు వెల్లడిస్తాయని గుర్తుచేశారు. జర్నలిస్టులు రాసే వార్తా కథనాలలో ఏవైనా భిన్నాభిప్రాయాలు, అవాస్తవాలు ఉంటే, వాటిపై వివరణ కోరాలి, ఖండించాలి లేదా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. అంతేకానీ, జర్నలిస్టులపై, పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో గర్హనీయం అన్నారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావు లేదన్నారు. మడికొండలో నమస్తే తెలంగాణ పత్రిక కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# విద్యార్థి అనుమానాస్పద మృతి

### క్లాస్ రూంలో పడిపోయిన సుజిత్ ప్రేమ్

### ఉపాధ్యాయులు కొట్టారంటూ తల్లిదండ్రుల ఆరోపణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నయీంనగర్‌లోని తేజశ్రీ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి బానోతు సుజిత్ ప్రేమ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం సృష్టించింది. సుజిత్ ప్రేమ్ క్లాస్ రూమ్‌లో కింద పడిపోవడంతో వెంటనే పాఠశాల యాజమాన్యం అతడిని ఆసుపత్రికి తరలించింది. విద్యార్థిని పరీక్షించిన వైద్యులు, అతడికి బ్రెయిన్ డెడ్ అయిందని, మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే, తమ కుమారుడు సహజంగా చనిపోలేదని, పాఠశాల ఉపాధ్యాయులు కొట్టడం వల్లే మరణించాడని తల్లిదండ్రులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ పాఠశాలలో గత నెల రోజుల క్రితం కూడా ఒక విద్యార్థి ఆడుకుంటూ గుండెపోటుతో (హార్ట్ ఎటాక్) మరణించిన ఘటన చోటుచేసుకుంది. ఆ ఘటన మరువక ముందే ఇప్పుడు సుజిత్ ప్రేమ్ చనిపోవడంతో మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపి, న్యాయం చేయాలని సుజిత్ ప్రేమ్ తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# ‘అడ్డుకుంటున్నదెవరు?’

## పార్టీల తీరుతో అయోమయంలో ప్రజలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ పిలుపు మేరకు శనివారం నిర్వహించిన బీసీ బంద్ కు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. 42 శాతం బీసీ రిజర్వేషన్ల కేటాయింపు డిమాండ్‌తో జరిగిన ఈ బంద్ ప్రశాంతంగా ముగిసినప్పటికీ, అధికార, ప్రతిపక్ష పార్టీల వైఖరి మాత్రం ప్రజల్లో తీవ్ర అయోమయాన్ని, ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. “చుట్టూ బాపన ఇండ్లే, చాపల ముండ్లు ఎలా వచ్చాయన్న చందంగా” పాలక పార్టీలే బంద్‌లో పాల్గొనడం విడ్డూరంగా ఉందని ప్రజలు మండిపడుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కూడా బీసీ బంద్‌లో పాల్గొని, ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టడం చర్చనీయాంశమైంది. 2023 ఎన్నికల హామీలో, కామారెడ్డి డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ప్రకారం కుల గణన చేపట్టి రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ చెబుతోంది. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ తాము శాసనసభలో ఆమోదం తెలిపి గవర్నర్, రాష్ట్రపతికి పంపామని, బీజేపీనే అడ్డుకుంటోందని ఆరోపిస్తోంది. బిల్లు గవర్నర్‌కు పంపి మూడు నెలలు దాటినందున ఆమోదం పొందినట్టేనని హస్తం నేతలు వాదిస్తున్నారు.

### న్యాయపరమైన అడ్డంకులు:

సుప్రీంకోర్టు గతంలో 50 శాతం దాటి రిజర్వేషన్లు ఇవ్వవద్దని తేల్చి చెప్పడంతో, 42 శాతం కేటాయింపు సరికాదంటూ కొందరు కోర్టులను ఆశ్రయించారు. దీంతో హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్, బీసీ రిజర్వేషన్లపై స్టే విధించింది. తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, కేసు హైకోర్టు పరిధిలో ఉన్నందున తాము స్పందించలేమని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం సరైన విధానాలు పాటించనందుకే కోర్టులు స్టే ఇచ్చాయని బీజేపీ విమర్శిస్తోంది. కాంగ్రెస్ కంటే తాము తక్కువ కాదన్నట్లుగా బీజేపీ కూడా బీసీ బంద్‌కు మద్దతు తెలిపి ధర్నాల్లో పాల్గొంది. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే 42 శాతం రిజర్వేషన్ సాధ్యపడటం లేదని కమలం పార్టీ శ్రేణులు విరుచుకుపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం సరైన శాస్త్రీయ పద్ధతులు పాటించకనే హైకోర్టు స్టే ఇచ్చిందని ఆరోపించాయి.

### మైలేజీ కోసం పోటాపోటీ నిరసనలు:

బీఆర్ఎస్, టీజేఎస్, సీపీఐ, ఎంసీపీఐ(యూ)తో సహా అన్ని రాజకీయ పార్టీలు బంద్‌లో పాల్గొన్నాయి. అయితే, బీసీ రిజర్వేషన్ల రాద్ధాంతానికి కారణమైన పాలక పార్టీలు (కాంగ్రెస్, బీజేపీ) సైతం రాస్తారోకోల్లో పాల్గొనడంపై ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు పోటాపోటీగా నినాదాలు చేసుకోవడం, తమ ప్రభావం చూపడానికి నాయకులు భారీగా శ్రేణులతో ప్రదర్శనలు నిర్వహించడం జరిగింది. బీసీ బంద్‌ను ఒక వేదికగా చేసుకొని రాజకీయ మైలేజీ కోసం నాయకులు ప్రయత్నించారని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారంలో ఉండి కూడా ధర్నాలు చేస్తున్న కాంగ్రెస్, కేంద్రంలో ఉండి రాష్ట్ర ప్రభుత్వ బిల్లులకు అడ్డుపడుతున్న బీజేపీ వైఖరిపై ప్రజలు నిలదీస్తున్నారు. తాము రిజర్వేషన్లకు అనుకూలమే అంటున్న పార్టీలు... అడ్డంకిని తొలగించడానికి ఏం చేస్తున్నాయో స్పష్టమైన సమాధానం చెప్పాలని బీసీ వర్గాలు కోరుతున్నాయి.

# దేవాలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

• ములుగు కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులలో వేగం పెంచి, వాటిని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయ అభివృద్ధి పనులను కలెక్టర్ దివాకర టీఎస్, ఆర్ అండ్ బీ ఈఎన్ సీ మోహన్ నాయక్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం దేవాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా గేట్ పిల్లర్ ఏర్పాటు చేయాలని, నాణ్యత లోపించకుండా స్టీల్, సిమెంట్‌తో పుట్టింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు. పనుల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్, ఎండోమెంట్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# 24న ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్

**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ (పురుషుల) రెండవ ఫేజ్ ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్‌ను అక్టోబర్ 24 ఉదయం 9.00 గంటలకు విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు ప్రాంగణంలో ప్రారంభిస్తారు. ముఖ్య అతిథిగా వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, గౌరవ అతిథిగా క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్, ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ చైర్మన్ ఆచార్య టి. మనోహర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ ఎస్. కుమార స్వామి హాజరు కానున్నారు. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై. వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

# కొండా మురళి జన్మదినం సందర్భంగా అనాథ పిల్లలకు క్రీడా సామాగ్రి పంపిణీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రజా నాయకుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండా మురళీధర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని, నగర కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీరామ్ రాజేష్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సుబేదారిలోని బాల సదనం (అనాథ పిల్లలకు)లో చిన్నారులకు గేమ్స్ కిట్స్ (క్రీడా సామాగ్రి) పంపిణీ చేశారు. అలాగే, హనుమకొండ ప్రాంతంలోని శిశు గృహలో పసిపిల్లల కోసం డ్రెస్సులు, బెడ్స్, క్యాప్స్, టవల్స్, మిల్క్ పౌడర్, దుప్పట్లు, డైపర్లు, ఆట బొమ్మలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ రాజేష్ మాట్లాడుతూ కొండా మురళీధర్ రావు అంటే పేద ప్రజలకు అండగా ఉండే నాయకుడని అన్నారు. పేద ప్రజలకు తోడుగా ఉంటూ, అన్ని విధాలుగా ఆదుకోవడం ఆయన సిద్ధాంతమని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితోనే జన్మదినం సందర్భంగా ఈ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కొండా మురళీధర్ రావు గారు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల నవీన్, బుర్ర తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండలోని ఇందిరా నగర్ స్మశాన వాటిక ప్రక్కన రోడ్డుపై పడి ఉన్న ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి చికిత్స పొందుతూ మరణించారు. 21న రాత్రి సుమారు 11:30 గంటల ప్రాంతంలో 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల ఆ వ్యక్తి రోడ్డు పక్కన పడి ఉండగా, 108 అంబులెన్స్ ద్వారా వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. అయితే, చికిత్స పొందుతూ ఆ వ్యక్తి 22న రాత్రి సుమారు 07:40 గంటల సమయంలో మరణించాడు. మృతుడి ఎత్తు సుమారు 6 అడుగులు, రంగు చామన చాయ, బ్లాక్ జీన్స్ ప్యాంట్, నీలపు రంగు షర్ట్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలిసినవారు పోలీసు స్టేషన్‌లోని అధికారులను సంప్రదించగలరని పేర్కొన్నారు.

# విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పర్వతగిరి పోలీసులు సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక సీఐ రాజగోపాల్, ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు అంబేద్కర్ సెంటర్‌లో హైస్కూల్, మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల్లో 80 శాతం మొబైల్ ద్వారానే జరుగుతున్నాయని తెలిపారు. పెరుగుతున్న సాంకేతికతను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. ఎలాంటి సైబర్ ఫ్రాడ్ జరిగినా వెంటనే 1930 నెంబర్‌కు సమాచారం అందిస్తే, పోలీసులు అప్రమత్తమై రికవరీ చేయడానికి సులభం అవుతుందని తెలిపారు. విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇటువంటి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తమ చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా జాగృతం చేయాలని సూచించారు. అలాగే, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. మహిళలు, చిన్న పిల్లలపై జరుగుతున్న నేరాలు విశృంఖలమైన ఆలోచనా విధానాల వల్ల చోటు చేసుకుంటున్నాయని, వీటి కట్టడికి చట్టాల ద్వారానే కాక, మానవుల మనస్సుల్లో మార్పు రావాలని పేర్కొన్నారు.

# మత ప్రచారం చేసే విద్యాసంస్థలపై చర్యలేవీ ?

**◆ బీజేపీ నేత కుందూరు మహేందర్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** పట్టణంలోని పుస్కోస్ పాఠశాలలో విద్యార్థులకు మత బోధనలు చేస్తూ మత మార్పిడికి ప్రేరేపిస్తున్నట్లు ఆరోపణలు వచ్చిన అంశంలో, మండల విద్యాశాఖ అధికారులు (ఎంఈఓ) ఎన్క్వైరీ చేసి నిజమని తేల్చినా ఇప్పటివరకు జిల్లా అధికారులు, పోలీసు శాఖ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి అధికారుల తీరును తీవ్రంగా ప్రశ్నించారు. చట్టం ఎటువైపు పోతుంది అని నిలదీశారు. భారతీయ జనతా పార్టీ , అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లినప్పటికీ, విద్యాశాఖ సంబంధిత అధికారులు, పోలీసు శాఖ ఇప్పటివరకు స్పందించకుండా, పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మహేందర్ రెడ్డి ఆరోపించారు. జిల్లా విద్యాశాఖ అధికారులకు, ప్రాంతీయ విద్యాశాఖ అధికారికి వివరాలు తెలిపినా... వారు పాఠశాలను సందర్శించి చర్యలు తీసుకునే విధంగా ఏ ఒక్క పని చేపట్టకపోవడం దేనికి నిదర్శనం అని ఆయన ప్రశ్నించారు. అధికారులు తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని, కొంతమంది స్వలాభం కోసం పనిచేస్తున్నారా? లేక అధికార పార్టీ నాయకుల ఒత్తిడి లేదా స్థానిక ఎమ్మెల్యే ఈ విషయాన్ని పక్కదారి పట్టించే విధంగా పనిచేస్తున్నారా? అనే విషయాన్ని అధికారులు స్పష్టం చేయాల్సిన సమయం ఆసన్నమైందని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. "ఇప్పటికైనా అధికారులు ఈ విషయాన్ని పట్టించుకొని సరియైన చర్యలు ఆ విద్యా సంస్థపై తీసుకోకుంటే, మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. మేము మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తాం," అని పత్రికా సమావేశంలో మహేందర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జడ సతీష్ మాట్లాడుతూ, మత బోధనలు చేస్తున్న పాఠశాలపై ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే హిందూ సంస్థలు మరియు భారతీయ జనతా పార్టీ కలిసి పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు పంజా వెంకటేశ్వర్లు కూడా పాఠశాల పై తక్షణమే చర్య తీసుకోవాలని, లేదంటే బీజేపీ ఈ విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టదని అధికారులను హెచ్చరించారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అవార్డులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్), వరంగల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిష్ఠాత్మక అవార్డులను కైవసం చేసుకున్నారు. గత శనివారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో నృత్యాలయ నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ మరియు సిరి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఆల్ ఇండియా సంగీతము మరియు నాట్య కళా ఉత్సవం 2025 లో వీరు విజయం సాధించారు. ఈ విభాగంలో పాల్గొన్న 26 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచి 'నాట్య మయూరి' అవార్డులు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. గాత్రానికి సంబంధించిన ఈ విభాగంలో 16 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని 'సంగీత సరస్వతి' అవార్డులు స్వీకరించారు. తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగుల నరసింహా రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డుల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరితా రెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. అలాగే, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన గురువులు శివ కుమార్, కామ్నా మిశ్రాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# వరంగల్ పురావస్తు పరిశోధనశాల సందర్శన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య గురువారం వరంగల్ జిల్లా పురావస్తు పరిశోధన, ప్రదర్శనశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ భద్రపరిచిన శిలాశాసనాలు, విగ్రహాలు, శిల్పకళా సంపదను ఆసక్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ చరిత్ర, కాకతీయుల సంస్కృతి తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ ప్రాంతపు గొప్ప వారసత్వాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఆమె అన్నారు. జిల్లా పురావస్తు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సంరక్షణా పనుల గురించి ఎంపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పురాతన శిల్పకళ, కాకతీయ శిలాశాసనాలు తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి తెలియజేస్తున్నాయని, వీటి సంరక్షణ కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మరిన్ని చర్యలు చేపట్టేలా కృషి చేస్తానని ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు. జిల్లా పురావస్తు అధికారులు ఎంపీకి వివిధ శిల్ప సంపద, ప్రాచీన నాణేలు, శాసనాల చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బుజ్జి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోలీసు సేవలపై అవగాహన

**పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా 'ఓపెన్ హౌస్'**



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా, భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో 'ఓపెన్ హౌస్' కార్యక్రమం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహించబడింది. జిల్లాలోని 7 పాఠశాలల నుంచి సుమారు 500 మంది విద్యార్థినీ–విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ అధికారులు విద్యార్థులకు పోలీసుల దినచర్య, విధులు, డయల్ 100 విధానం, ఫిర్యాదు ఎలా ఇవ్వాలి, విచారణ ప్రక్రియ వంటి విషయాలను వివరించారు. ముఖ్యంగా, కింది అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు మరియు వాటి నుంచి రక్షణ, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలు, ట్రాఫిక్ నియమాలు, వాటి ప్రాముఖ్యత, భరోసా, షీ టీమ్ వంటి బాలికల రక్షణ విభాగాలు, సెక్యూరిటీ, యాంటీ నార్కోటిక్ డ్రగ్ విభాగాల పనితీరుపై అవగాహన కల్పించారు. అలాగే, ఎస్పీ కిరణ్ ఖరే విద్యార్థులకు ఆయుధాలు, పోలీస్ చట్టాలు, సీసీ కెమెరాల ప్రాధాన్యం, ఫింగర్ ప్రింట్ పరికరాలు, ట్రాఫిక్ సేఫ్టీ, సైబర్ భద్రత వంటి అంశాలపై సవివరంగా వివరించి, మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏకే–47, ఎస్ఎల్ఆర్, 9ఎంఎం పిస్టల్ వంటి ఆయుధాలు, డాగ్ స్క్వాడ్ ప్రదర్శన, బీడీ టీమ్, క్లూస్ టీమ్ విభాగాల పనితీరు, కమాండ్ కంట్రోల్ రూమ్, స్పీడ్ లేజర్ గన్, డ్రగ్స్ నిరోధక పరికరాల ప్రదర్శనలు జరిగాయి. కొన్ని సాంకేతిక పరికరాల వినియోగాన్ని విద్యార్థులకు ప్రాక్టికల్ డెమో రూపంలో చూపించారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సహనంతో సమాధానాలు ఇచ్చారు. పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అధికారులు తెలిపారు. చట్టాన్ని గౌరవిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ముఖ్యంగా సైబర్ నేరాల వలలో పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ నేర ఫిర్యాదు నంబర్ 1930 ప్రాధాన్యతను మరోసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# శారీలో మెహరీన్ మెరుపులు

టాలీవుడ్ యంగ్ బ్యూటీ మెహ్రీన్ ఫిర్జాదా గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు టాలీవుడ్‌లో చాలా సినిమాలే చేసింది కానీ స్టార్ హీరోయిన్‌గా మాత్రం గుర్తింపు సంపాదించుకోలేకపోయింది. ప్రస్తుతం ఈ చిన్నది అడపాదడపా సినిమాలు చేస్తూ కెరీర్ కొనసాగిస్తుంది. ముఖ్యంగా ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు బాలీవుడ్ పై ఫోకస్ పెట్టి అక్కడ ఫుల్ బిజీ అయిపోతుంది. మెహ్రీన్ ఫిర్జాదా, 2016లో వచ్చిన కృష్ణగాడి వీర ప్రేమగాథ సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది, తన ఫస్ట్ సినిమాతోనే అందం, అభినయంతో అందరినీ ఆకట్టుకుంది. తన క్యూట్ క్యూట్ ఎక్స్ప్రెషన్స్‌తో అందరినీ తనవైపు లాక్కుంది. ఆ తర్వాత ఫిల్లౌరీ అనే హిందీ సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది. ఇక ఈ సినిమా తర్వాత మెహ్రీన్‌కు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. దీంతో వరస సినిమాలతో ఫుల్ బిజీ అవుతుంది, స్టార్ హీరోయిన్‌గా సత్తా చాటుతుందని అందరూ అనుకున్నారు. కానీ ఎవరూ ఊహించని విధంగా ఈ ముద్దుగుమ్మ కెరీర్ డౌన్ ఫాలోఅయ్యింది. మొదటి సినిమా సూపర్ హిట్ అందుకుంది. తర్వాత చేసిన సినిమాల్లో చాలా వరకు ఫ్లాప్ అయ్యాయి. మహానుభావుడు, ఎఫ్2, ఎఫ్3 వంటివి మాత్రమే ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక ఈ ముద్దుగుమ్మ నటించిన సినిమాలు ఫ్లాప్ కావడంతో ఈ ముద్దుగుమ్మకు కూడా ఆపర్స్ రావడమే కరువైపోయింది. దీంతో ఈ బ్యూటీ బాలీవుడ్ పై ఫోకస్ పెట్టి అక్కడ సినిమాలు చేయడానికి రెడీ అవుతున్నట్లు ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది, తాజాగా గ్రీన్ కలర్ శారీలో అందంగా ముస్తాబై, తన అంద చందాలతో అందరి మనసు దోచేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.






# రెడ్‌కలర్ డ్రెస్‌లో మెరిసిన శ్రీలీల


ఈ మధ్య అందాల ముద్దుగుమ్మ శ్రీలీల గ్లామర్ డోస్ పెంచుతూ, యూత్‌కు నిద్రలేకుండా చేస్తుంది. రోజు రోజుకు తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ రెడ్ కలర్ ట్రెండీ వేర్‌లో తన అందంతో అందరినీ మాయ చేస్తుంది. పెళ్లి సందడి మూవీతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టిన చిన్నది శ్రీలీల. వచ్చిన ప్రతి ఛాన్స్ మిస్ చేసుకోకుండా, వరసగా సినిమాలు చేస్తూ తన అభిమానులను అలరిస్తుంది. ముఖ్యంగా ఈ బ్యూటీ దరవు సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ మూవీ తర్వాత చాలా సినిమాలు చేసినప్పటికీ అవి డిజాస్టర్ అయ్యాయి. దీంతో ఈ చిన్నదానికి తెలుగులో ఆఫర్స్ కాస్త తగ్గాయి. తర్వాత మళ్లీ పుష్ప2 సినిమాలో కిసక్కి డ్యాన్స్‌తో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంది. ఈ సాంగ్‌లో ఈ అమ్మడు నటన, గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీని తర్వాత ఈ చిన్నదానికి వరసగా ఆఫర్స్ క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది. ఇక ఎప్పుడూ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ చిన్నది, తాజాగా రెడ్ కలర్ ట్రెండీ వేర్‌లో తన అంద చందాలతో అందరినీ మాయ చేస్తుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



# రాజాసాబ్‌కు గ్రాండ్ వెల్కమ్

టాలీవుడ్ దర్శకుడు మారుతి–గ్లోబల్ స్టార్ ప్రభాస్ కాంబోలో వస్తోన్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ రాజాసాబ్. హార్రర్ కామెడీ జోనర్‌లో పాన్ ఇండియా బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ చిత్రంలో మాళవిక మోహనన్, ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్, రిద్ధికుమార్ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ప్రభాస్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ  రాజాసాబ్ స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. కారు రూఫ్‌టాప్‌పై స్టైలిష్‌గా కూర్చున్న రాజాసాబ్‌కు గ్రాండ్ వెల్ కమ్ చెబుతున్న స్టిల్ ఇప్పుడు అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఇప్పటికే  రాజాసాబ్ ట్రైలర్‌ను లాంచ్ చేయగా.. కామెడీ, లవ్, రొమాన్స్, హార్రర్ లాంటి ఎలిమెంట్స్‌తో మారుతి మార్క్ కామెడీ టచ్‌తో సినిమా ఉండబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేస్తుంది. ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నారు. మేకర్స్ చాలా రోజుల క్రితం రాజాసాబ్ గ్లింప్స్ లాంచ్ చేశారని తెలిసిందే. గ్లింప్స్‌లో ప్రభాస్ సూపర్ స్టైలిష్‌గా చేతిలో పూలబొకే పట్టుకొని అద్దంలో తనను తాను చూసుకుంటూ.. పూలు చల్లుతూ నయా లుక్‌లో కనిపిస్తూ అభిమానులకు విజువల్ ట్రీట్ ఇస్తున్నాడు. ఈ మూవీని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. రాజాసాబ్‌లో సంజయ్ దత్ సంజూబాబా పాత్రలో కనిపించబోతున్నాడు.





# 25న ది గర్ల్‌ఫ్రెండ్ ట్రైలర్!

ఈ యేడాది రశ్మిక వ్యక్తిగత జీవితంలోనూ, వృత్తి జీవితంలోనూ సమ్ థింగ్ స్పెషల్. చిరకాలంగా ప్రేమించుకుంటున్న విజయ్ దేవరకొండ, రశ్మిక వివాహ నిశ్చితార్థం ఇదే యేడాది జరిగింది. అలానే యేడాది ప్రారంభంలో విడుదలైన 'ఛావా' భారీ విజయాన్ని అందుకుని, రశ్మిక సత్తాను జాతీయ స్థాయిలో మరోసారి నిరూపించింది. అయితే ఆ తర్వాత వచ్చిన 'సికిందర్, కుబేర, థామా' చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోవడంలో విఫలమయ్యాయి. దాంతో పెద్దంత బజ్ క్రియేట్ చేసిన 'ది గర్ల్ ఫ్రెండ్'పై ఇప్పుడు అందరూ దృష్టి పెట్టారు. కంటెంట్ ప్రధానంగా నటుడు రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించిన ఈ సినిమా నవంబర్ 7న పాన్ ఇండియా భాషల్లో విడుదల కాబోతోంది. దీనికి ముందు ఈ నెల 25న థియేట్రికల్ ట్రైలర్ రానుంది. దీక్షిత్ శెట్టి హీరోగా నటించిన 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీని అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నిర్మించారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా ఆలోచింప చేస్తుందని నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, విద్యా కొప్పినీడి చెబుతున్నారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరాలు సమకూర్చిన 'ది గర్ల్ ఫ్రెండ్'లోని కొన్ని పాటలు ఇప్పటికే విడుదలై శ్రోతలను ఆకట్టుకుంటున్నాయి.

# కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన

- మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అమ్మకాలు
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** ప్రభుత్వం పత్తి రైతుల కోసం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు సులభంగా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అమ్ముకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని దేసైపెల్లి, ముద్దునూరు, బంధంపెల్లి గ్రామాల పత్తి రైతులకు కిసాన్ యాప్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు స్లాట్ బుకింగ్, పేమెంట్ ట్రాకింగ్, ఆధార్, భూమి రికార్డుల ద్వారా సులభంగా నమోదు చేసుకోవడం వంటి సదుపాయాలున్నాయన్నారు. ఆధార్ నంబర్‌తో స్వీయ-నమోదుతో పాటు మార్కెట్‌లో రద్దీని తగ్గించడానికి, క్యూలను నివారించడానికి స్లాట్ బుక్ చేసుకోవచ్చని అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అమ్మకాలు జరుపుకోవడంతో పాటు పేమెంట్ ట్రాకింగ్ వంటి సదుపాయాల ద్వారా లావాదేవీలలో పారదర్శకతను అందిస్తుందన్నారు. ముందుగా ప్లేస్టోర్ నుంచి కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని యాప్‌లో ఆధార్, భూమి రికార్డులు (పట్టాదారు పాస్‌బుక్), పంట రకం, విస్తీర్ణం, ఇతర అవసరమైన వివరాలను నమోదు చేయాలన్నారు. పత్తి అమ్మాలనుకుంటున్న మార్కెట్‌ను ఎంచుకుని స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన పత్తికి మంచి మద్దతు ధర రూ.8,110 వస్తుందని తెలిపారు. పత్తి ఏరడానికి కాటన్ బ్యాగ్స్, పాత చీరలు వాడాలని, ప్లాస్టిక్ సంచులు వాడరాదని తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సెంటర్స్, ప్రైమరీ స్కూల్స్ ను ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, నర్సంపేట ఏడీఏ దామోదర్ రెడ్డి, వ్యవసాయ అధికారి మాధవి, ఏఈఓలు హనుమంతు, విజయ్, రాజేశ్ ఆయా గ్రామాల పత్తి రైతులు పాల్గొన్నారు.

**రైతులతో ఆర్బిట్రేషన్..**

జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన గురువారం గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే 163జి నిర్మాణంలో భూములు కోల్పోయిన నెక్కొండ మండలంలోని పత్తిపాక, వెంకటాపూర్, నెక్కొండ గ్రామాల రైతులకు అవార్డ్ పాస్ చేసేందుకు ఆర్బిట్రేషన్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ ఉమారాణి, తహసిల్దార్ రాజ్ కుమార్, ఎన్ హెచ్ ఇంజనీరింగ్ అధికారి భూక్య ఈశ్వర్ కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ సుజాత , రైతులు తదితరులు పాల్గొన్నారు.



# రోగులకు పండ్ల పంపిణీ

**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** కొండ మురళీధర్ రావు జన్మదినం సందర్భంగా గురువారం సీకేఎం ఆస్పత్రిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పేద రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వరంగల్ కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు జారతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి గోపాల నవీన్ రాజ్ కూరగాయల మార్కెట్ లోనూ భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నవీన్ రాజ్ మాట్లాడుతూ కొండా మురళీధర్ రావు జన్మదిన వేడుకలను అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూరగాయల మార్కెట్ వర్తక సంఘం ప్రతినిధులు గులాం సర్వర్, మున్న, వల్లూరు బాబురావు, మజీద్ మహమ్మద్ బాబా, కార్పొరేటర్ చింతాకు అనిల్, కాంగ్రెస్ నాయకులు భాషాపాక సదానందం, గూడ రమ్య, నవీన్, ఎర్రం కమల్, వ్యాపారస్తులు జారతి వెంకటేశ్వర్లు, కాసర్ల రాజు, పర్ష, గోపి, హరి, నాగరాజు, బుజ్జా, కొండ శ్రీను, చుక్క రవి, పరిష విటల్, పిన్న మల్లేశం, మిట్టపల్లి సంజయ్, బొత్త చందర్, శాబాద్ రాణదీపు తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మక దేవాలయం వేయి స్తంభాల గుడి

- అద్భుతమైన వాస్తు కళ సొంతం
- ఫిదా అయిన అరవింద్ కుమార్, విశ్వజిత్ ఖన్నా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అద్భుతమైన వాస్తు కళతో అలరారుతున్న చారిత్రాత్మక దేవాలయం వేయి స్తంభాల గుడి అని ఉత్తరప్రదేశ్, పంజాబ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్లు అరవింద్ కుమార్, విశ్వజిత్ ఖన్నా కొనియాడారు. వరంగల్ లోని కాకతీయుల కళా సంపదను వీక్షంచేందుకు అరవింద్ కుమార్ దంపతులు, విశ్వజిత్ ఖన్నా దంపతులు గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ కు విచ్చేశారు. వీరిని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ కలెక్టర్ సత్య శారదా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి ఆహ్వానం పలికారు. అనంతరం వీరు వేయి స్తంభాల గుడిని సందర్శించారు. ఈ సందర్భంగా పూజారులు మహా రుద్రాభిషేకం నిర్వహించి వేద పండితులచే ఆశీర్వచనం అందించారు. కాకతీయుల కళ చతురతను చూసి అబ్బురపడ్డారు. చైర్మన్లు ఇరువురు మాట్లాడుతూ కాకతీయుల సామ్రాజ కళాపిపాసకు, శిల్పుల పనితనానికి మచ్చుతునకగా వేయి స్తంభాలగుడి నిలుస్తుందని పేర్కొన్నారు. ఇంతటి ప్రసిద్ధి గల కాకతీయుల వంశానికి చెందిన వేయి స్తంభాల గుడిని దర్శించుకోవడం సంతోషదాయకంగా ఉందన్నారు. అనంతరం భద్రకాళి ఆలయాన్ని దర్శించుకున్నారు. భద్రకాళి ప్రధాన అర్చకులు శేషు పూర్ణకుంభతో స్వాగతం పలికి మహదాశీర్వచనం జరిపించారు. తదనంతరం వరంగల్ లోని ప్రసిద్ధి చెందిన ఓరుగల్లు కోటలో ఉన్న కాకతీయ కీర్తితోరణాలు, ఏకశిల గుట్ట, గుండుచెరువు, ఖుష్ మహల్ ను సందర్శించారు. స్వయంభూ శివాలయంలో పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. అక్కడ ఉన్న గైడ్ సూర్య కిరణ్ వివరిస్తూ చరిత్ర ప్రకారం ఈ కోటకు మూడు ప్రాకారాలు ఉన్నాయని, ఆ ప్రాకారాల అవశేషాలు ఇప్పటికి కూడా చూడవచ్చన్నారు. మొదటి ప్రాకారం మట్టితో చేసినది దీనిని ధరణి కోట అని పిలుస్తారని వివరించారు. ఈ కీర్తి తోరణాలు ఇప్పటి తెలంగాణ రాష్ట్ర ఆధికారిక చిహ్నంగా ఉన్నాయని చెప్పారు. తదనంతరం చైర్మన్లు ఇరువురు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర గల వరంగల్ ను సందర్శించడం సంతోషంగా ఉందని, కాకతీయులు నిర్మించిన స్మారక కట్టడాల్లో కోటలు, సరస్సులు, దేవాలయాలు, రాతి ద్వారాలు పర్యాటక ఆకర్షణగా ఉన్నాయని అన్నారు. ఎన్పీడీసియల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జీడబ్ల్యుయంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయి శాలువ, మెమొంటోతో ఇరువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, హనుమకొండ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, వరంగల్ ఎస్ఈ కె.గౌతమ్ రెడ్డి, డీఈలు సాంబరెడ్డి, మల్లికార్జున్, భాస్కర్, ఏడీఈ పి.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో సాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) పథకం అమలుకు సమగ్ర సమాచారంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం కుడా కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో సాస్కి పథకం అమలులో భాగంగా కుడా, బల్దియాలోని పట్టణ ప్రణాళిక ఇంజనీరింగ్, శానిటేషన్ తో పాటు పలు విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కమిషనర్ పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ సాస్కి పథకానికి సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా అవగాహన చేసుకొని వారంలోగా పూర్తి సమాచారం అందజేయాలన్నారు. నగరంలోని పురాతత్వ విధానాలను ప్రోత్సహించి అభివృద్ధి చేయాలని, పాదచారులు నడిచే మార్గాలను అభివృద్ధి చేయడం, మౌలిక వసతులను కల్పించడం, ప్రజలకు రక్షణ చర్యలు చేపట్టడం, సీసీ కెమెరాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, ఓపెన్ స్పేస్ లను అభివృద్ధి చేయడం, స్పాంజ్ సిటీ ఏర్పాటు ఇందుకోసం అనువైన స్థలాన్ని గుర్తించడం సిటీ గ్రీన్ కార్యక్రమంలో నగరంలో గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం పురాతన బావుల పునరుద్ధరణ తదితర అంశాల పట్ల దృష్టి సారించి నమోదు చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ కుడా సీపీఓ అజిత్ రెడ్డి, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్ఓ రమేష్, హెచ్ఓ లక్ష్మారెడ్డి, ఈఈలు రవికుమార్, సంతోష్ బాబు, డీఈలు రవి కిరణ్, శివానంద్, స్మార్ట్ సిటీ పీఎంసీ ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

**కమ్యూనిటీ హాల్ నిర్వహణ బల్దియా దే..**

నగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హాల్ నిర్వహణ బల్దియాదేనని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ నిధులతో నిర్మాణం చేసిన అన్ని కమ్యూనిటీ హాల్ లను వెంటనే స్వాధీనం చేసుకొని ఇకపై బల్దియా అధికారులే నిర్వహణ చేయాలని కమిషనర్ సూచించారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ నిధులతో నిర్మాణం చేసిన కమ్యూనిటీ హాల్ లను ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కమిషనర్ ఈ చర్యలకు ఆదేశించారు. నగర పరిధిలో సుమారుగా 60-80 చిన్న పెద్ద కమ్యూనిటీ హాలు ఉన్నాయని వీటిలో సగానికి పైగా బల్దియా అధికారుల చేతిలో ఉన్నాయని మిగిలిన కొన్ని కమ్యూనిటీ హాల్ లను ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి రావడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా గురువారం హనుమకొండ టీఎన్జీవోస్ కాలనీలోని రోజ్ గార్డెన్ ను టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకొని బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com